# (మందు) చూపు

జె.కె.

ఈ రెండక్షరాలు చాలు ఎటువంటి వస్తువునయినా క్షణాల్లో అమ్మిపారేస్తుంది.

ఇండియన్ కన్స్యూమర్ మార్కెట్‌ని సగానికిపైగా సొంతం చేసుకున్న సంస్థ ఛైర్మన్ జె.కె.

అతని తెలివి తేటలు అపారం. ఏ వస్తువునయినా మార్కెట్లో ఎలా క్లిక్ చేయాలో అతనికి బాగా తెలుసు. భారత దేశంలో వున్న కొద్దిమంది మేథావుల్లో ఆయనొకరు.

అటువంటి జె.కె. ఆ రోజు రెండు నిమిషాలు అపాయింట్‌మెంట్ ఆత్మానందునికి కేటాయించారు.

భయపడుతూనే లోపలకు అడుగు పెట్టాడు ఆత్మానందం.

అతను ఊహించిన దానికి భిన్నంగా వున్నాడు జె.కే.

"విషయం ఏమిటో తెలుసుకోవచ్చా?" ప్రశ్నించాడు జె.కె. వెంటనే మరో ఆలోచన లేకుండా బ్యాగ్‌లో వున్న బాటిల్ ఒకదానిని తీసి టేబుల్ మీద వుంచాడు ఆత్మానందం.


"సార్... ముప్పై సంవత్సరాలుగా రేయిం బవళ్ళు కృషిచేసి ఈ మందును కనుక్కున్నాను. **There is no permanent cure in dandruf**" అని మెడికల్ డిక్షనరీలో వుండొచ్చును కాని, తొలిసారిగా 'చుండ్రు' అనేది ఈ మందు వాడిన నెల రోజులకి శాశ్వతంగా తగ్గిపోతుంది. జుట్టు కూడా పెరుగుతుంది. భారత దేశం లాంటి వేడి ఎక్కువగా వుండే ప్రదేశాల్లో 'చుండ్రు' నూటికి అరవై మందికి వుంటుంది. ఈ మందు ఫార్ములా మీకు ఇవ్వాలని వచ్చాను చెప్పాడు ఆత్మానందం. తనకిచ్చిన అపాయింట్‌మెంట్‌లో ఒక నిముషం గడిచిపోయిందని ఊహిస్తూ.

"బావుంది... మీతో తెచ్చిన శాంపిల్‌ని టేబిల్ మీద వుంచి ఒక పది రోజుల తరువాత కలవండి. రిజల్ట్ బావుంటే ఫర్‌దర్‌గా మనం మాట్లాడుకోవచ్చు" చెప్పాడు జె.కే.

ఆనందంగా సీట్లోంచి లేచాడు ఆత్మానందం. ఆ పది రోజులు ఉత్సాహంగా గడిపి పదో రోజు జె.కే. దగ్గరకు వెళ్ళాడు.

'మీ మందు చాలా బాగా పనిచేసింది. పది రోజుల్లోనే దాని గుణం కనపడింది."

"థాంక్యూ సార్..." చెప్పాడు ఆత్మానందం.



కనీసం ఓ యాభై లక్షలన్నా రావచ్చని ఊహిస్తూ.

"బట్ ఆత్మానందం. ఒక విషయం గుర్తుంచుకోండి. వ్యాపారం చేసేవాడెవడూ ఇటువంటి మెడిసిన్ అమ్మడు."

"కారణం" క్షీణగొంతుతో అడిగాడు ఆత్మానందం.

"మీ మందు వాడితే పది రోజుల్లో చుండ్రు శాశ్వతంగా తగ్గిపోతుంది. అంటే ఒక బాటిల్ కొన్నవాడు జీవితంలో మరో బాటిల్ కొనడు. ఒకటి బాగా గుర్తుంచుకోండి ఈ దేశంలో దేనినయినా శాశ్వతంగా నయం చేయకూడదు. మందు వాడినా ప్రమాదం లేదు అనుకున్న మెడిసిన్ మార్కెట్లో బ్రహ్మాండంగా క్లిక్ అవుతుంది. మీరు ఆ పని మీద వుండండి."

— టి.వి. ప్రసాద్

## శకునం

'ఆ పాడుముండ ఎక్కడుందో చూడండ్రా!... తీరా బయల్దేరాక ఎదురొచ్చి ఛస్తుంది'... మరోసారి కేకేసింది బామ్మగారు.

ఆ పాడు ముండంటే ఎవరో కాదు. రెండేళ్ల క్రితం మా ఇంట్లో తిష్టవేసిన 'పిల్లి'.

బామ్మగారు మహాచాదస్తం మనిషి. శకునాలు, వగైరాల పట్టింపులెక్కువ. 'పంచాంగం' చూడందే కాలు కదపదు. రెండేళ్లనుండీ వేధిస్తుండడంతో ఆమెకోసం పుణ్యక్షేత్రాల యాత్రాస్పెషల్ (బస్సు)కి టికెట్ కొన్నాను. ఈ రోజే ప్రయాణం. పిండి వంటలూ, బట్టలూ సర్దుకొని బయల్దేరబోతూ, శకునం కోసం ఎదురు చూస్తోంది. ఆమెకి ఎదురు రావడానికి, నా అర్థాంగి మహాలక్ష్మి, వీధి గుమ్మంలో 'రెడీ'గా వుంది.

ఆ 'పిల్లి' అంటే-బామ్మగార్కికి తగని మంట. 'తను బాత్రూంలోంచి కాలుజారి పడడానికి కారణం, బుజ్జిగాడికి మూడో తరగతిలో మార్కులు తక్కువ రావడానికీ, నవల చదువుతూ, కూరలు తరుగుతున్న మా పెద్దమ్మాయి 'వేలు' తెగడానికి కారణం — వారు పొద్దున్నే పిల్లి మొహం చూడ్డమే...' అని ఆమె నమ్మకం. ఆమె పోరు పడలేక రెండు మూడుసార్లు దాన్ని దూరంగా వదిలేసి వచ్చాం. అరగంటలో ఇంటికి తిరిగొచ్చేదా పిల్లి. కాబట్టే మేము ప్రయత్నాల్ని ఆపేశాం.

"నువ్వలా వారం వర్జం అంటూ కూచో... అక్కడ 'బస్సు' కదలబోతోంది" అంటూ గొడవగా అరుస్తూ, బామ్మగారి సామాన్లన్నీ ఆటోలో సర్దాడు మా పెద్దాడు. నా భార్య ఎదురు రాగా, ఇంట్లోంచి బయటికొచ్చారు బామ్మగారు. సరిగ్గా అప్పుడే ఆమెకి ఎదురుగా వచ్చింది పిల్లి. దూరపు చూపు సరిగా ఆనక పోవడంతో ఆ హడావుడిలో దాన్ని గమనించలేదు. ఆటో కదుల్తూండగా చూసింది, ఆ పిల్లిని దగ్గరగా.

'ఈ పాడుముండ... ఎదురుగానీ అవలేదు గదరా...' అంటున్న బామ్మగారిని కసిరాడు మా పెద్దాడు.

పదిహేను రోజులు, తన యాత్రని దిగ్విజయంగా పూర్తి చేసుకొచ్చారు బామ్మగారు. అందరికీ ప్రసాదాలు పంచుతూ అడిగారు. ఏది ఆ పాడు ముండ!? ఎక్కడ చచ్చిందీ శకున పక్షి...!

"నీకు పిల్లి ఎదురైతే శకునం అంటావు. బహుశా, ఆ రోజు అది నిద్ర లేచినప్పుడు నువ్వెదురయ్యావేమో..., నువ్వెళ్లిన రోజు సాయంత్రమే కారుకింద పడి చచ్చిపోయింది బామ్మా..." అని ప్రసాదం పొట్లం సొంతం లాక్కుని బయటికి తుర్రుమన్నాడు మా బుజ్జిగాడు.

వాడి మాటలకి మెల్లిగా నవ్వుతూ తలెత్తి చూసిన నాకు కనిపించింది... బామ్మగారి కళ్లల్లో పల్చటి 'కన్నీటి పొర'.

—పవన్